క్లుప్తంగా

స్వర నీరాజనం..



వయొలిన్ కచేరీ నిర్వహిస్తున్న ద్వారం దుర్గాప్రసాదరావు, తదితరులు

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాల సీనియర్ వయొలిన్ అధ్యాపకుడు జి. అన్నాజీరావు సంస్మరణ సంగీత సభ బుధవారం కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఆంధ్రా , తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో స్థిరపడిన అన్నాజీరావు శిష్యులు పాల్గొని గురువుకు స్వర నీరాజనం అందించారు. కార్యక్రమంలో ద్వారం దుర్గాప్రసాదరావు, డాక్టర్ ఎ.గోపాలరావు, పూర్వవిద్యార్థి చాగంటి కొండలరావు, కళాశాల అధ్యక్షురాలు మండపాక నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న అనురాధ

విజయనగరం ఫోర్ట్: చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీఓ బి. అనురాధ అన్నారు. బుధవారం స్థానిక తోటపాలెం అంగన్వాడీ కేంద్రంలో కమ్యూనిటీ బెస్ట్ ఈవెంట్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణులు గర్భం దాల్చినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులో వివాహం చేసుకోవడం, గర్భం దాల్చడం శ్రేయస్కరం కాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త మంగ, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువకుడికి ఆర్థిక సాయం



యువకుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉద్యోగులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడలో నిరుపేద యువకుడికి పలువురు ఉద్యోగులు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన వంకర అప్పారావు ఇటీవల విద్యుత్ స్తంభం ఎక్కుతూ జారి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కేవీడీ ఉద్యోగులు రూ. 20 వేల నగదు, నిత్యావసర సరుకులు అప్పారావు కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి

విజయనగరం క్రైమ్: అగ్ని ప్రమాదాలు బారిన పడకుండా ప్రతిఒక్కరూ కనీస జాగ్రత్తలు పాటించాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కె.వినయ్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక సాయి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఆవరణలో సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్, ఆయిల్, విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో కేంద్ర సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీని ఇంటికి సాగనంపుదాం..

విజయనగరం పూల్‌బాగ్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. వామపక్షాల ఆలిండియా కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని అంబటిసత్రం ప్రాంతంలో బుధవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో కార్పొరేట్ శక్తులు ఆర్థికంగా బాగుపడితే.. ప్రజలు బాగా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో చిన్న, శంకర్, వెంకట్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోండి..

బొండపల్లి: ఈ నెలాఖరులోగా కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులతో పాటు వివిధ కారణాల వల్ల ఇంతవరకు రైతుభరోసా అందని వారు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పీవీ మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30లోగా రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల్లో గాని సచివాలయాల్లో గాని దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు.

దివ్యాంగులకు కొత్త జీవితం..

- మండలానికో భవిత కేంద్రం ఏర్పాటు
- ఉచితంగా ఉపకరణాల అందజేత



దివ్యాంగులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి (ఫైల్)

భోగాపురం: దివ్యాంగుల భవితకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. మండల కేంద్రాల్లో ప్రత్యేక భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి వారిని వివిధ అంశాల్లో సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతోంది. వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడంతో పాటు గృహస్థాయిలో ఫిజియోథెరపీ అందిస్తోంది. ప్రతి ఆదివారం డెంకాడ భవిత కేంద్రంలో.. మంగళ, బుధ, శుక్రవారాల్లో భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో ఫిజియోథెరపీ క్యాంపులు నిర్వహిస్తున్నారు. భవిత కేంద్రాలకు రాలేని స్థితిలో ఉన్న మానసిక దివ్యాంగులకు ప్రతి శనివారం 'ఇంటి వద్దకే విద్య' అనే కార్యక్రమం ద్వారా ఇంటికి వెళ్లి వారికి ప్రత్యేక పద్ధతులలో ఫిజియోథెరపీ చేస్తారు.

ప్రతి మండలంలో సేవలు

నెల్లిమర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో నాలుగు భవిత కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 615 మంది దివ్యాంగ చిన్నారులు ఉన్నారు. వీరిలో 68 మంది భవిత కేంద్రాలకు వస్తున్నారు. 547 మంది విద్యార్థులలో కొంతమంది ఇంటివద్ద, మరికొంత మంది ఇతర పాఠశాలలో చదువుకుంటున్నారు. చిన్నారులకు ఫిజియోథెరపీ చేసేందుకు ఐఈఆర్టీలు (ఇన్‌క్యూజివ్, ఎడ్యుకేషన్, రిసోర్స్ టీచర్) వారానికి ఒకసారి కేంద్రాలకు వస్తుంటారు. ఆ సమయంలో చిన్నారులకు ఫిజియోథెరీ చేయడంతో పాటు ఇళ్ల వద్ద ఎటువంటి మెలకువలు పాటించాలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు. కదల్లేని పిల్లల ఇళ్ల వద్దకు ప్రతి శనివారం వెళ్లి తల్లిదండ్రులకు పలు అంశాలను తెలియజేస్తారు.

భవిత కేంద్రాల్లో అందుతున్న సేవలు

- మానసిక వికలాంగులకు రూ.14 వేల విలువైన ఎంఆర్ కిట్స్ ఉచితంగా అందిస్తారు.
- ఉచితంగా మధ్యాహ్న భోజనంతో పాటు బస్సు పాస్‌లను ఇస్తారు.
- వేల రూపాయాలు విలువ చేసే హియరింగ్ మిషన్, చక్రాల కుర్చీలు, తదితర ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారు.
- అత్యంత తీవ్రమైన మానసిక వైకల్యం కలిగిన వారికి ప్రధానంగా దినసరి కార్యక్రమాలు (కాల కృత్యాలు) ఎలా చేసుకోవాలో, కృత్యాలు (యాక్టివిటీ)ల ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయులు చేస్తూ, విద్యార్థులచే చేయిస్తున్నారు.
- మానసిక వికలాంగులకు ప్రత్యేక శిక్షణ ద్వారా (టీచర్ లెర్నింగ్) సులువు పద్ధతిలో పాఠాలు బోధిస్తున్నారు.
- చెవిటి, మూగ విద్యార్థులకు అక్షరాల బొమ్మల ద్వారా అక్షరాలు నేర్పిస్తున్నారు.
- దివ్యాంగుల్లో వైకల్యం కలిగిన వారు ఇతరులపై ఆధారపడకుండా వారి పనులు వారే చేసుకునేలా తర్ఫీదునిస్తున్నారు.

సాధారణ పిల్లలతో మెలిగేలా శిక్షణ



దివ్యాంగ చిన్నారులు మిగతా పిల్లలతో సమానంగా మెలిగేలా శిక్షణ ఇస్తున్నాం. వారి వైకల్య శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నాం. వారిలో ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నాం. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్ద విద్యను అందిస్తున్నాం.

–డీవీ రమణరాజు, ఐఈఆర్టీ భోగాపురం

ప్రత్యేక దృష్టి..



దివ్యాంగులకు అందాల్సిన వసతులన్నీ సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నాం. తల్లిదండ్రులు పిల్లలను భవిత కేంద్రాలకు తీసుకొచ్చేలా సేవల వివరాలు తెలియజేస్తున్నాం. క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ అందించి వారిలో మార్పు వచ్చేందుకు కృషి చేస్తున్నాం

–రమణమూర్తి, ఎంఈఓ భోగాపురం

స్పాట్ సెంటర్ ఏర్పాటు చేయాలి

విజయనగరం పూల్‌బాగ్: నగరంలో శాశ్వత ప్రాతిపదికన స్పాట్ సెంటర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వై.అప్పారావు, డి. శ్యామ్ కోరారు.

బుధవారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రస్తుతం పదో తరగతి స్పాట్ కేంద్రం వద్ద ఏర్పాట్లు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. డీఈఓ, ప్రధానోపాధ్యాయుల స్థాయిలో స్పాట్ మినహాయింపులు తీసుకుని అనుగుణంగా ఆర్డర్లు ఇవ్వడం వల్ల చాలావరకు స్పాట్ కేంద్రం వద్ద క్యాన్సిలేషన్ల సమస్య తగ్గిందని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా ప్రైవేట్ సంస్థ అయిన ఎం.ఆర్ కాలేజీలో స్పాట్ నిర్వహించడం వల్ల కొన్ని ఇబ్బందులేర్పడుతున్నాయని చెప్పారు.

విద్యాశాఖ మంత్రి చొరవ తీసుకొని జిల్లా కేంద్రంలో శాశ్వత ప్రాతిపదికన స్పాట్ కేంద్రాన్ని ఏర్పాటు (శాశ్వత భవన నిర్మాణం) చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన అవనాపు విక్రమ్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం: శ్రీకాకుళం జిల్లా మూలపేటలో రూ. 4,362 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన పోర్టుకు సంబంధించి భూమి పూజ చేసేందుకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యూత్ వింగ్ జోనల్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన విక్రమ్‌ని సీఎం జగన్ మోహన్‌రెడ్డి అభినందించారు. రానున్న ఎన్నికలలో యువజన విభాగాన్ని పటిష్ఠం చేసి, పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి..

- ట్రాఫిక్ ఎస్సై త్రినాథరావు



ప్రజలకు మజ్జిగ అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై త్రినాథరావు

విజయనగరం ఫోర్ట్: వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ట్రాఫిక్ ఎస్సై త్రినాథరావు అన్నారు. పట్టణంలోని మయూరి హోటల్ వద్ద ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మజ్జిగ, మంచినీళ్లు ఎక్కువగా తాగాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున సాధ్యమైనంతవరకు ఇళ్లకే పరిమితం కావాలన్నారు. కార్యక్రమంలో గద్దె చిరంజీవి, ఝాన్సీ, తిరుపతి, గుప్త, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

- డీఎంహెచ్ఓ రమణకుమారి



పారసాంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారిణి రమణకుమారి

నెల్లిమర్ల రూరల్: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని గ్రామాల్లో పక్కాగా నిర్వహించాలని జిల్లా వైద్యాధికారిణి ఎస్వీ రమణ కుమారి ఆదేశించారు. మండలంలోని కొండగుంపాం, పారసాం గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి, పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా పర్యటించి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. వైద్యులు నిత్యం అందుబాటులో ఉండి రోగులకు సేవలు అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే శతశాతం ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. ఆమె వెంట సీసీ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా

చీపురుపల్లి: స్థానిక బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇటీవలే పదో తరగతి పరీక్షలు పూర్తవ్వడంతో మిగిలిన విద్యార్థులు అంతా కలిసి వారికి వీడ్కోలు పలికారు. విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. హెచ్‌ఎం డి.గౌరీదేవి, పీఎంసీ కమిటీ ప్రతినిధి మీసాల సీతారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించండి



ఉపాధి సిబ్బందితో సమావేశమైన ఎంపీడీఓ రామకృష్ణరాజు

చీపురుపల్లి: ఉపాధి పనుల ప్రదేశంలో వేతనదారులకు తాగునీటి సౌకర్యం కల్పించేలా, నీడ కోసం టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ పథకం సిబ్బందికి ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ, ఈసీ, ఫీల్డు అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల కారణంగా వేతనదారులు ఉదయం 7 గంటలకే పని ప్రారంభించి 10గంటలకు ముగించాలని, తిరిగి మధ్యాహ్నం పనులు నిర్వహించాలన్నారు. వేతనదారులకు గరిష్ఠ వేతనం అందేలా రెండు పూటలా పనులు చేయించాలని, పనులకు హాజరయ్యే వారికి మాత్రమే మస్తర్లు వేయాలని సూచించారు. ఏపీఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది తలెత్తకూడదు

దత్తిరాజేరు: ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వేతనదారులకు పని ప్రదేశంలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, నీడ కోసం టెంట్లు వేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఎండీడీఓ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉదయం ఏడు గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల వరకు పనులు చేయాలని సూచించారు. వేతనదారులకు మెడికల్ కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఏపీఓలు సత్యవతి, వెంకటప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రయ్.. రయ్

గంట్యాడ: ఎస్.కోట మండలంలోని బొడ్డవర నుంచి గంట్యాడ మండలం తాటిపూడి, కొర్లాం, కొత్తరుబిల్లి, నరవ, రామవరం మీదుగా కలెక్టరేట్ జంక్షన్ వరకు సుమారు 30 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తికావచ్చా యి. గతంలో 30 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ రోడ్డును 60 అడుగుల వెడల్పు చేస్తున్నారు. రూ. 90 కోట్లతో ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నారు. గతంలో గోతులతో ఉండే ఈ రోడ్డుపై ప్రయాణం చేసేందుకు ప్రజలు అవస్థలు పడేవారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణ, అభివృద్ధి కావడంతో వాహనచోదకులు రయ్ రయ్ మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.



రామవరం వద్ద పూర్తయిన రోడ్డు విస్తరణ

యువతే నా బలం..

- ఎమ్మెల్యే కోలగట్ల



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: యువతే తన బలమని... వీరంతా అండగా ఉండబట్టే మునుపెన్నడూ లేనివిధంగా విజయనగరంలో ఇంత అభివద్ధి సాధించామని డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బుధవారం తన నివాసం వద్ద మండలంలోని కొండకరకాం, గుంకలాం గ్రామాలకు చెందిన యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా సాగుతుందంటే.. యువత ఇచ్చిన ఉత్సాహమేనని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడం వల్లే ఈరోజు మనమంతా గర్వంగా గడపగడపకు.. వెళ్లగలుగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో లంచగొండితనం లేని పాలన నడుస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోరుకునే ఇటువంటి ముఖ్యమంత్రికి మనమంతా మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో యువజన, విద్యార్థి విభాగాలను పటిష్ఠం చేయాలని.. ఇందుకు సంబంధించి గ్రామాలు, జోనల్ వారీగా కమిటీలు వేస్తున్నామని తెలిపారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా నియోజకవర్గ ఎమ్మెల్యేగా తాను ఎప్పుడూ అండగా ఉంటున్నానని, అర్ధరాత్రి సమయంలో నైనా తన ఇంటి తలుపును ధైర్యంగా తట్టవచ్చునని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండల డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు అల్లు చాణక్య, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జీవీ రంగారావు, మండల జోనల్ ఇన్‌చార్జ్ కెల్ల త్రినాథ్, సర్పంచులు కిలారి రాంబాబు, కునుకు నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు భోగాపురపు ఆదినారాయణ, వైస్ ఎంపీపీ నారాయణ, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

ప్రజల ఆనందమే లక్ష్యం..



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 40, 36 డివిజన్‌లలో రూ.63.25 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

విజయనగరం: నగరంలోని అన్ని వర్గాల ప్రజల ఆనందమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 40, 36వ డివిజన్‌లలో రూ. 63.25 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రైన్లు, తదితర అభివృద్ధి పనులను మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, తదితరులతో కలిసి బుధవారం ప్రారంభించారు. కంటోన్మెంట్ బొగ్గులదిబ్బ ప్రాంతంలోని రెండు సీసీ రహదారులు, వీటీ అగ్రహారం గణేష్‌నగర్, సంతోష్ నగర్ ప్రాంతాల్లోని ఏడు రహదారులు, కాలువలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయా కార్పొరేటర్లు బోనెల ధనలక్ష్మి, బాలి పద్మావతి, తదితరులు మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే పరిష్కరిస్తున్నారని చెప్పారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న వ్యక్తి వీరభద్రస్వామి అని కొనియాడారు. ఆయన హయాంలోనే నియోజకవర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు పలు సమస్యలను కోలగట్ల దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు బొద్దాన అప్పారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, నాయకులు ఎస్.బాబు, మొయిద ఆదిబాబు, బాలి కృష్ణారావు, తాళ్లపూడి శంకరరావు, కడగల ఆనంద్, కుమ్మరగంటి శ్రీనివాసరావు, పరమేశ్వరి దేవి, తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రి పరిశీలన

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిని జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఆస్పత్రిలో ఆర్వోప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని, కోవిడ్ వార్డును సందర్శించారు. అనంతరం ఆస్పత్రి వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆస్పత్రిలో మౌలిక వసతులపై ఆరా తీశారు. అనధికారికంగా సైకిల్ స్టాండ్ నిర్వహిస్తున్నవారిని పిలిచి ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంబంగి అప్పలనాయుడు, ఏపీఎంఐడీసీ ఈఈ సత్యప్రభాకర్ పాల్గొన్నారు.



సర్వజన ఆస్పత్రిని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



ఉద్యోగాలకు ఎంపికైన వారిని సత్కరిస్తున్న శిక్షకులు

చీపురుపల్లి: స్థానిక జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఉచితంగా శారీరక ధారుఢ్య శిక్షణ తీసుకుని రైల్వే గ్రూప్–డి ఉద్యోగాలు సాధించిన వివిధ గ్రామాలకు చెందిన 11 మంది యువకులను ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి కంది హేమంత్ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. పట్టణానికి చెందిన ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగి హేమంత్, నవీన్‌ల ప్రోత్సాహంతో జీవీఆర్ కళాశాల మైదానంలో యువతకు రోజూ ఉదయం, సాయంత్రం ఉచితంగా శారీరక ధారుఢ్య శిక్షణ ఇస్తున్నారు. చీపురుపల్లి, గరివిడి మండలాల పరిసర గ్రామాల నుంచి దాదాపు వంద మంది వరకు శిక్షణకు హాజరవుతున్నారు.

నేడు జెడ్పీ చైర్మన్ పర్యటన

వేపాడ: మండలంలోని వీలుపర్తి, వల్లంపూడి గ్రామాల్లో గురువారం నిర్వహించనున్న 'జగనన్నే మా భవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్' కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరు కానున్నారని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, హాజరు కావాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా ఏవస్మందికి తెలియజేయునది ఏమనగా నా క్లయంటు అయిన కర్రోతు సతీష్ S/o పైడినాయుడు మరియు గార మౌనిక W/o సతీష్ వారు డెంకాడ మండలం అక్కివరం గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నెంబరు 162/4P లో 23సెట్లు మరియు 162/5లో 12 సెంట్లు మెట్టు భూమిని డెంకాడ మండలం, అక్కివరం గ్రామ కాపురస్తుడైన కంది సూర్యనారాయణ S/o లేటు తమ్మన్నగారి గురునాయుడు గారి వద్ద నుండి కొనుటకు పై నా క్లయింట్లు పురోణి చేసుకొనియున్నారు. కావున పైన తెలిపిన భూమిపై ఏవిధమైన అభ్యంతరములు గాని, ఆక్షేపనలుగాని ఎవరికైనా ఉన్నచో ఈ బహిరంగ ప్రకటన ప్రచురితమయ్యే ఈ తేదీ నుండి 5 రోజులలోపు తెలియపరచవలసినదిగా కోరుచున్నాము. ఏ విధమైన అభ్యంతరములు రాని యెడల నా క్లయింట్లు సదరు భూమిపై ఎటువంటి వివాదంలేని భూమిగా భావించి, నా క్లయింట్లు రిజిస్ట్రేషన్ చేసుకొందురు.

షెడ్యూలు :

సర్వే నెంబరు 162/4P -0.23 సెంట్లు మెట్టు భూమికి హద్దులు
తూర్పు – కంది చంద్రినాయుడు
దక్షిణం – ఈ భూమి అమ్మినవారితాలుకా మెట్టు భూమి
పశ్చిమం – రోడ్డు
ఉత్తరం – రస్తా మరియు గెడ్డ

సర్వే నెంబరు – 162/5 – 0–12 సెంట్లు మెట్టు భూమికి హద్దులు
తూర్పు – కంది చంద్రి నాయుడు
దక్షిణం – కంది చంద్రినాయుడు
పశ్చిమం – రోడ్డు
ఉత్తరం – ఈ భూమిని అమ్మినవారి తాలుకా మెట్టుభూమి

సం/– కె.వెంకటేశ్వరరావు.,B.A, B.L
పి.రవి.,B.A, B.L
Advocate & Notary
Vizianagaram- 535002, 9440705469, 8328627907